క్లుప్తంగా

ఘనంగా దర్గా ఉర్సు



మరికల్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న మాస్వన్ ఉర్సు ఉత్సవాలు ఆదివారం జీపు డ్రైవర్ యూనియన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. దర్గాను ప్రత్యేక వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆశన్న, జావేద్, జైపాల్‌రెడ్డి, కుమార్, నర్సింహులు, రాజు, ఆంజనేయులు, రాంచంద్రయ్య, బాలయ్య, శివరాజ్, కృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోటకొండలో వనభోజనాలు



నారాయణపేట రూరల్ : కార్తీక మాసం ప్రారంభం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. మండలంలోని కోటకొండలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. సమాజం పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో గ్రామ శివారులోని జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అందరు కలిసి ఒకేచోట వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చందులాల్, కార్యదర్శి బసూదేనారాయణరావు, ఎల్.వెంకటేష్, కిషన్‌రావు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణమెప్పుడో?



మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి –నేరడగందొడ్డి గ్రామాల మధ్య చిన్న వాగుపై గతంలో వంతెన నిర్మించగా నెలల వ్యవధిలోనే కూలిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వంతెన లేకపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని నేరడగందొడ్డి గ్రామస్తులు అంటున్నారు. మండల కేంద్రానికి చేరుకోవాలంటే చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దీంతో సమయం వృథాతో పాటు సకాలంలో పనులు కావడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలని కోరతున్నారు.

మద్దూరులో కోలాట ప్రదర్శన



మద్దూరు: మండలంలోని వీరభద్రియ సంఘం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం రాత్రి ప్రదర్శించారు. ప్రాచీన కళలను ప్రదర్శించాలనే ఉద్దేశంతో సంఘంలోని ప్రతి యువతి కోలాట ఆటను శిక్షణ పొంది ప్రదర్శిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి ఒక్కరూ మన సంస్కృతిని కాపాడలనే ఉద్దేశంతో ప్రదర్శిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

నర్వ: జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలకు నర్వ విద్యార్థి ఎంపికైనట్లు ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన నందకిశోర్ అనే విద్యార్థి కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రతిభకనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గద్వాలలో జరిగే పోటీల్లో జిల్లా జట్టు తరపున ఆడనున్నారన్నారు. విద్యార్థి నందకిశోర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు అమరచింతలో బొడ్రాయి పూజలు

అమరచింత: పట్టణంలో బొడ్రాలను స్థాపించి ఏడాది పూర్తికావడంతో వార్షిక పూజలు సోమవారం నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని 10 వార్డులలో ప్రతిష్ట చేసిన బొడ్రాల వద్ద పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శివచౌడేశ్వరి ఆలయం వద్ద నాభిశిలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తప్పని సాగు కష్టాలు..

- సొంత డబ్బులతో కాల్వల్లో పూడిక తీయించిన రైతులు
- మూతపడిన తూము
- పట్టించుకోని అధికారులు



మాగనూర్ పెద్ద చెరువు కింద పూడికతీత పనులు చేపట్టిన రైతులు

మాగనూర్: మండల కేంద్రంలోని గ్రామ పెద్ద చెరువు కింద రైతులు కొన్ని సంవత్సరాలుగా సొంత డబ్బులతో పంటకాల్వల పూడికతీత పనులను చేసుకుంటున్న సంబంధిత ఇరిగేషన్ అధికారులు మాత్రం ఇటువైపు చూడకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పెద్ద చెరువుకు సంబంధించిన మొదటి తూము అధికారుల నిర్లక్ష్యంతో మూతపడిన పరిస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యంతో వర్షకాలం పంటసాగు చేసుకోలేక పోయామని రైతులు వాపోతున్నారు.

పంట కాల్వ నిర్మాణమెప్పుడో..

మండల కేంద్రంలోని పెద్దచెరువు విస్తీర్ణం 41.17 క్యూబిక్ మీటర్లు అయితే చెరువు కింద 329 ఎకరాల్లో చెరువు నుంచి నీరందించాల్సి ఉండగా దాదాపుగా 150ఎకరాలకు పైగా చెరువు నీరందడం లేదు. ఉన్న వాటిలో మట్టి కాల్వలు ముళ్లకంపలతో మూసుకపోవడంతో నీరుపారడం లేదు. పక్కనే చెరువుల్లో పుష్కలంగా నీళ్లున్నా పంటలకు పారబెట్టుకోలేని దుస్థితి ఏర్పడింది.

సొంత డబ్బులతో పూడికతీత పనులు..

ప్రతి సంవత్సరం పెద్దచెరువు కిందపంట పొలాలకు నీరందించే కాల్వలకు మరమ్మతు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కింద సిమెంట్ కాల్వలు నిర్మించాలని అధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీంతో ప్రతి సంవత్సరం రైతులు సొంతం డబ్బులతో కాల్వల్లో పూడికతీయించుకుంటు పంట సాగు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు పెద్దచెరువుపై దృష్టిసారించి సిమెంట్ కాల్వలు నిర్మించాలని కోరుతున్నారు.

సిమెంట్ కాల్వలు నిర్మించాలి..



చెరువు నీటిపైనే రైతులు ఆధారపడి వరిపంట సాగు చేసుకుంటున్నారు. చెరువులో నీళ్లు ఉన్న కాల్వలు మూసుకుపోవడంతో పంటలకు నీరు పారడం లేదు. ప్రభుత్వం స్పందించి పంట కాల్వలు నిర్మించాలి.

\- ప్రతాప్‌రెడ్డి, రైతు, మాగనూర్

సొంత డబ్బులతో పనులు..



ప్రస్తుతం గ్రామ పెద్దచెరు వు కింద పంటసాగు అంటేనే భయం వేస్తుంది. ప్రతి సంవత్సరం పంట సాగు చేసుకోవాలంటే ముందు కాల్వలను పూడిక తీసుకోవాలి. రైతులమే స్వయంగా చందాల వేసుకుని కాల్వల్లో పూడికతీయించుకుంటున్నాం.

\- మారెప్ప, రైతు మాగనూర్

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

గ్రామ పెద్దచెరువు కింద కాల్వ పూడికతీత పనులు ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద చేసుకోవడానికి అవకాశం ఉంది. అయితే ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ ద్వారా కాల్వపూడికతీత పనులు చేపటేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వెంటనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

\- సురేష్, డీఈఈ ఇరిగేషన్, మక్తల్

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మండలంలోని గార్లపల్లికి చెందిన లక్ష్మప్పకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. 46వేల 600 చెక్కు, గుడిగండ్ల గ్రామానికి చెందిన అశప్పకు రూ. 22వేల చెక్కును ఆదివారం పట్టణంలోని వాకిటి శ్రీహరి చెక్కును బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, పీఏ తిమ్మప్ప, రవికుమార్, శంశోద్దీన్, రవికుమార్, ఆనంద్‌గౌడ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 4న జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు మక్తల్ నుంచి వెళ్తున్న క్రీడాకారులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి క్రీడా దుస్తులు అందజేశారు. ఎమ్మెల్యే సతిమణి వాకిటి లలితమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, కోళ్ల వెంకటేష్, పీఈటీలు మీనాకుమారి, రూప, రేణుక, స్వరూప, రాము, దామోదర్ పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కరిస్తాం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీ సుధారాణి, ఏఈ వెంకటేష్

కోస్గి: విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతోపాటు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని విద్యుత్ శాఖ ఏడీ సుధారాణి సూచించారు. ఈ మేరకు ఆదివారం వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాల పరిధిలోని వినియోగదారుల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఈ మేరకు.. పలువురు వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదు చేయగా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ఏఈలకు సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఈలు వెంకటేష్, భానోదయ్, నిరంజన్ దాస్, బాల్‌రాజ్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యతే నేరాలకు కారణం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: నిరక్ష్యరాస్యత చట్టాలపై అవగాహన రహిత్యం వల్లనే నేరాలకు కారణమవుతున్నాయని దళిత సంఘాల జేఏసీ అధ్యక్షుడు రామారం వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నపొర్లలో జూన్‌నెలలో భూవివాదాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన గువ్వల సంజీవ్ కుటుంబానికి జేఏసీ ఆధ్వర్యంలో రూ.70వేల ఆర్థికసాయం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో దళిత సంఘాల నాయకులు హాజరై సంస్మరణ సభ నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేకపోవడంతో ఒక నిండు ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించి నేరరహిత సమాజ నిర్వహణ వైపు అడుగులు వేయాలని ఆయన కోరారు. సంజీవ్ మృతి విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ. 20లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోరు కృష్ణయ్య, దుబాయి కృష్ణ, ఆశన్న, చెన్నప్ప, వివేకనంద, కృష్ణయ్య, మాణిక్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సేవా భారత సేవకులు

దామరగిద్ద: మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగం సేవా భారత ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వివిధ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. కొత్త ఉపాధ్యాయులు భావిభారత పౌరులను తీర్చి దిద్దడంలో బాధ్యతగా వ్యవహరించి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈదప్ప, విజయమోహన్‌రెడ్డి, వెంకట్రాములు, గోపాల్‌రావు, కృష్ణగౌడ్, అశోక్, నాగేందర్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

యువత స్ఫూర్తితో ఉద్యోగాలు సాధించాలి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన రమాదేవి డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిందని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉద్యోగాలు సాధించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ అన్నారు. ఆదివారం గ్రామంలో రమాదేవిని శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సీనియర్ నేత కాకం చిన్ననారాయణ, శంకరమ్మ దంపతుల కూతురు రమాదేవి టీచర్ ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో రమాదేవిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, కాకంకాశన్న, కుర్వ హన్మంతు, అంజి, రాముడు, సంతోష్, రామాంజనేయులు, వెంకటమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చేపపిల్లల పంపిణీ

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం చేపపిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి తెలిపారు. మండలంలోని ఆశన్‌పల్లి, లక్ష్మీపూర్, లోకూర్తి, పిడెంపల్లి, మల్‌రెడ్డిపల్లి, దామరగిద్ద చెరువుల్లో ఉదయం 11నుంచి చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఆంజనేయస్వామి జాతర



నారాయణపేట రూరల్: మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో రెండురోజులుగా శ్రీ ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ మేరకు.. ఆలయంలో స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జాతర సందర్భంగా నిర్వహించిన రెట్టాపట్ల కార్యక్రమంలో వివిధ గ్రామాల యువత హాజరయ్యారు.

ధర్నాను విజయవంతం చేయాలి



మక్తల్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ, పీఆర్‌సీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ.. తపస్ ఆధ్వర్యంలో ఈ నెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు రవీందర్, రాకేష్ కోరారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 317జీఓ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా బాధ్యులు నాగర్జున, గౌరవ అధ్యక్షుడు నర్సిరెడ్డి, సభ్యులు నర్సింహులు, రాములు, రాజు, రామాంజనేయులు, అనిల్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడుని ఆత్మకూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందించి తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రహ్మతుల్లా, మండల అధ్యక్షుడు పరమేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్ యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు నల్గొండ శ్రీను ఉన్నారు.



శ్రీశైలం బస్సు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న చైర్మన్లు

నారాయణపేట రూరల్: కార్తీకమాసం సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శ్రీశైలం వెళ్లేభక్తుల సౌకర్యార్థం పేటనుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డిపోలో నూతన సర్వీసును మున్సిపల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు గందె అనసూయ, రాంపురం సదాశివరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన కార్తీక మాసంలో నదీస్నానం ఆచరించడం, పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు ఎంతో మంది ప్రజలు శ్రీశైలం వెళ్లడం ఆనవాయితీగా వస్తుందని, అలాంటి వారి సౌకర్యార్థం బస్సును నడిపించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆదేశించడంతో బస్సుసర్వీసును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీరోజు ఉదయం 8:20గంటలకు పేటలో మధ్యాహ్నం 3:30గంటలకు శ్రీశైలంలో తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. డీఎం లావణ్య, కౌన్సిలర్ సలీం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంతు, నాయకులు గందె చంద్రకాంత్, మాధవరెడ్డి, రఘువీర్, మారుతి, శరణప్ప, వెంకట్రాములు, కార్తీక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లించాలి



కొల్లంపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఖరీఫ్ సీజన్‌లో పండించిన అన్ని పంటలకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కొల్లంపల్లి, చిన్నజట్రం, బోయిన్‌పల్లి గ్రామాల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫారస్‌లను అమలు చేయాలని, రైతుభరోసా ఎగ్గొట్టకుండా చెల్లించాలని, డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో చేస్తున్న నిర్లక్ష్యానికి నిరసనగా సోమవారం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నారాయణ, రాము, వెంకటయ్య, మొగులప్ప, కార్తీక్ పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లి, రాంపూర్ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటింటా సభ్యత్వ నమోదులో అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిధ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ప్రజలు బీజేపీని ఆరాదీస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాంచంద్రి, అశోక్, కేశవ్, రమేష్, నర్సింహ, అంజి, రాజు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధన్వాడ: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప అలియాస్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తీసుకొచ్చిన తరువాతనే ఉద్యోగాలు భర్తీచేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే 11వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తున్న ధర్మయుద్ధ సదస్సులో మందకృష్ణమాదిగ పాల్గొంటారని మండలం నుంచి పెద్దసంఖ్యలో మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. తిమ్మయ్య, టాకిరాజు, వెంకటయ్య, హన్మంతు, వెంకటయ్య, బాలు, శ్రీను, కృష్ణయ్య, వంశీ, మోహన్, తిరుమలమ్మ, కృష్ణయ్య, అంజిలయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కోస్గి/మద్దూరు: రాష్ట్రంలో యాదవులు జరుపుకునే సదర్ పండుగను అధికారికంగా నిర్వహించాలని సీఎం రేవంత్ జీఓ జారీ చేయడంపై మండల యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు.. ఆదివారం పట్టణంలోని సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. యాదవుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, బస్వరాజ్, రాములు, వెంకటయ్య, మల్లేష్, నాగులు, పకిరప్ప, నర్సింహులు, కన్కప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోస్గి పట్టణంలోని స్థానిక పీరంపల్లి అంజయ్య కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పీరంపల్లి శ్రీనివాస్, వెంకటేష్, నర్సింహులు, హన్మంతు, బస్వరాజ్ యాదవ్, యాదగిరి పటెల్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూర్: జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల దళిత తహసీల్దార్ నరేందర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, జిల్లా నాయకుడు మాసన్న, మండల అధ్యక్షుడు దండు శ్రీను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు సమావేశమై మాట్లాడారు. ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ దళితుడు కావడంతో అగ్రవర్ణాలకు చెందిన ప్రభాకర్‌రెడ్డి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. అధికారం అడ్డుపెట్టుకుని దాడులకు తెగబడతామని హెచ్చరించి మరి దాడి చేయడం అమానుషమన్నారు. ప్రభాకర్‌రెడ్డితో పాటు దాడికి పాల్పడిన ఆయన అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బాలమణ్యం, డాక్టర్ కృష్ణ, కురుమూర్తి, ఎనుముల కిషోర్, జానకి రాములు, బోరెల్లి రాము, కుర్మన్న, రాములు, సహదేవుడు, తదితరులు ఉన్నారు.

ఘనంగా రంగోత్సవం పోటీలు



డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం ఘనంగా రంగోత్సవం జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సీనియర్ న్యాయవాది బెక్కం జనార్దన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకర విషయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామన్నారు. సీనియర్ విద్యార్థులకు రీసైకిల్, రీయూజ్, రీస్టోర్ అనే అంశం కాగా జూనియర్లకు న్యాచుర్ బ్యూటీ అవర్ రెస్పాన్స్‌బిలిటీ అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 1600మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.